ప్రిజన్ డ్యూటీ మీట్ విజేతలకు సిఎం అభినందనలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఏడవ ఆల్ ఇండియా ప్రిజన్ డ్యూటీ మీట్ -2025లో వివిధ పోటీల్లో పతకాలు సాధించిన వారిని సిఎం రేవంత్ రెడ్డి అభినందించారు. మీట్-2025 తెలంగాణ ప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. దేశంలోని వివిధ రాష్ట్రాలతో జరిగిన పోటీలలో 133 పతకాల్లో 28 (21 బంగారు, 4 రజతం, 3 కాంస్యం) పతకాలను తెలంగాణ కైసవం చేసుకుంది. ఈ కార్యక్రమంలో హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా, జైళ్ల విభాగం డిజి సౌమ్య మిశ్రా, ఐజీ మురళి బాబు, వరంగల్ రేంజ్ డిఐజి సంపత్, ఎస్పీలు శివ కుమార్ గౌడ్, కళాసాగర్, డ్యూటీ మీట్ పోటీ విజేతలు పాల్గొన్నారు.

అంధ విద్యార్థులకు సంగీత వాయిద్య పరికరాలు

- అందజేసిన సిఎం, మంత్రులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

అంధ విద్యార్థులకు సంగీత వాయిద్య పరికరాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ అందజేశారు. కరీంనగర్ జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం అంధ విద్యార్థులకు సంగీతంలో శిక్షణనిచ్చింది. పరికరాలు అందుకున్న విద్యార్థులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎదుట పాట పాడి వినిపించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాడిన పాటల సిడిని సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపి అనిల్ కుమార్ యాదవ్, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, సిఎం ఓఎస్డి వేముల శ్రీనివాస్, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా ఎన్వీఎస్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రిటైర్డ్ఐఎస్ అధికారి ఎన్వీఎస్.రెడ్డిని ప్రభుత్వ సలహాదారు (పట్టణ రవాణా)గా నియామకం చేశారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ పట్టణ రవాణా సలహాదారుగా ఆయన రెండేళ్ల పాటు పదవిలో కొనసాగనున్నారు. పలువురు ఐఎఎస్లను బదిలీ చేస్తూ సిఎస్ ఆదేశాలు జారీ చేశారు. ఎన్వీఎస్ రెడ్డిని హెచ్ఎంఆర్ ఎండి బాధ్యతల నుంచి రిలీవ్ చేసిన ప్రభుత్వం.. మెట్రో రైలు ఎండిగా సర్ఫరాజ్ అహ్మద్కు అదనపు బాధ్యతలు అప్పగించింది. మహిళా, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్గా శృతి ఓజా, ఎస్సి గురుకులాల కార్యదర్శిగా కృష్ణ ఆదిత్య, హెచ్ఎండిఎ కార్యదర్శిగా కోట శ్రీవాత్సవకు అదనపు బాధ్యతలు అప్పగించారు. హైదరాబాద్ చీఫ్ రేషనింగ్ అధికారిగా ఎం రాజిరెడ్డి, ఆదిలాబాద్ జిల్లా పరిషత్ సిఇఒగా జి జితేందర్ రెడ్డి, ఆదిలాబాద్ జిల్లా అదనపు కలెక్టర్గా రాజేశ్వర్, హెచ్ఎండిఎ (సబ్-అర్బన్ రీజియన్) జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్గా, హెచ్ఎండిఎ (కోర్ అర్బన్ రీజియన్ అండ్ మెట్రో రైల్) జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్గా నియమితులయ్యారు.

యాచకురాలిపై లైంగిక దాడి

- ఇబ్రహీంపట్నంలో ఆలస్యంగా వెలుగులోకి..

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

దుండగుల దురాఘతాలకు చిన్నారులే కాదు టఔద్ధులు కూడా బలవుతున్నారు. తాగిన మైకంలో ఒంటరిగా ఉన్న మహిళలు, చిన్నారులు, టఔద్ధులపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. ఇలాంటి ఘటనే రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో ఆలస్యంగా వెలుగు చూసింది. టఔద్ధురాలైన యాచకురాలిపై లైంగికదాడి జరిగింది. ఇందుకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నంలో 70 ఏండ్ల యాచకురాలిపై సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగుడు లైంగికదాడి చేశాడు. మంగళవారం తెల్లవారుజామున వృద్ధురాలి తలకు గాయమై రక్తపు మడుగులో ఉండటాన్ని గమనించిన స్థానికులు 108కు ఫోన్ చేసి ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సమీపంలోని సిసి కెమెరాల పుటేజీలను పరిశీలించారు. వృద్ధురాలిపై సుమారు 40 ఏండ్ల గుర్తుతెలియని వ్యక్తి లైంగికదాడికి పాల్పడినట్టు గుర్తించారు. అతని కోసం గాలిస్తున్నారు.

కాంగ్రెస్లో చేరిన బిఆర్ఎస్ నేతలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఘర్ వాపసీ పిలుపునందుకుని పలువురు బిఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ గూటికి చేరారు. మంగళవారం హైదరాబాద్లోని గాంధీభవన్లో టిపిసిసి అధ్యక్షులు మహేశ్కుమార్గౌడ్ సమక్షంలో ఆదిలాబాద్ జిల్లాకు చెందిన బిఆర్ఎస్ నేతలు గంద్రత్ సుజాత, సాజిద్ ఖాన్, సంజీవ్ రెడ్డి కాంగ్రెస్లో చేరారు. వారికి మహేశ్కుమార్గౌడ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

నేడు గాంధీభవన్లో విలీనం దినోత్సవం

విలీన దినోత్సవంపై ప్రజలను బిజెపి గందరగోళపరుస్తున్నదని టిపిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. ఎప్పటిలాగే బుధవారం గాంధీభవన్లో భారీ ఎత్తున విలీన దినోత్సవాన్ని నిర్వహిస్తామని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని జిల్లా కేంద్రాల్లో కూడా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నిజాం సర్కారుకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ పోరాడిందని గుర్తు చేశారు. ఆనాడు బిజెపి, ఆర్ఎస్ఎస్, బిఆర్ఎస్ ఎక్కడున్నాయని ప్రశ్నించారు. విలీన దినోత్సవంపై వారికి మాట్లాడే అర్హత లేదని స్పష్టం చేశారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

- ప్రమాదవశాత్తు జారిపడి మరొకరికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. మరో వ్యక్తి కదులుతున్న రైలు ఎక్కే క్రమంలో ప్రమాదవశాత్తు జారి కింద పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనలు సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో గల రైల్వే స్టేషన్లో మంగళవారం జరిగాయి. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఝరాసంగం (మం) ప్యాలవరానికి చెందిన నర్సింలు (55) కొంతకాలంగా జహీరాబాద్ పట్టణంలోని శాంతినగర్లో కుటుంబంతో కలిసి అద్దె ఇంట్లో నివసిస్తున్నాడు. కొన్ని రోజులుగా కుటుంబంలో తగాదాలు అవుతున్నాయి. దీంతో మనస్తాపానికి గురైన నర్సింలు ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. మంగళవారం జహీరాబాద్ రైల్వే స్టేషన్కు వచ్చి షిరిడి సాయినగర్ నుంచి తిరుపతి వెళ్తున్న రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని ప్రభుత్వ అస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నామని రైల్వే పోలీసు హరిప్రసాద్ తెలిపారు.

ప్రమాదవశాత్తు జారిపడిన ప్రయాణికుడు

షిరిడి నుంచి తిరుపతి వెళుతున్న ప్రత్యేక రైలులో ప్రయాణిస్తున్న ప్రయాణికుడు అనిల్ బెత్కర్ జహీరాబాద్ రైల్వే స్టేషన్లో దిగాడు. అయితే రైలు స్టార్ట్ కావడంతో ఆయన ఎక్కే ప్రయత్నం చేయగా.. ప్రమాదవశాత్తు కాలు జారి రైలు కింద పడిపోయాడు. దీంతో ఆయనకు తీవ్ర గాయాలై, రెండు చేతులు కోల్పోయాడు. అనిల్ బెత్కర్ను జహీరాబాద్ ప్రభుత్వ అస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని రైల్వే పోలీస్ అధికారి తెలిపారు.

చరిత్రను వక్రీకరిస్తే ప్రజలు క్షమించరు

- బైరాన్పల్లిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి
- అమరుల స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఉద్యమిస్తాం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్వెస్లీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

"భూమి కోసం.. భుక్తి కోసం, వెట్టిచాకిరీ నుంచి విముక్తి కోసం.. దున్నేవానికే భూమి కావాలని ఎర్రజెండా నాయకత్వంలో తెలంగాణ సాయుధ రైతాంగ వీరోచిత పోరాటం చేసింది కమ్యూనిస్టు పార్టీ.. భూస్వాముల నుంచి పది లక్షల ఎకరాల భూములు స్వాధీనం చేసుకుని నిరుపేదలకు పంచిన ఘన చరిత్ర కమ్యూనిస్టులది.. ఆ పోరాటంతో ఏమాత్రం సంబంధం లేని బిజెపి తామే వారసులమని చెప్పుకోవడం సిగ్గుచేటు.. చరిత్రను వక్రీకరిస్తే ప్రజలు క్షమించరు.. రాష్ట్రంలో 25 లక్షల ఎకరాల భూములు ఉన్నాయి.. వాటిని పేదలకు పంచే దమ్ముందా మీకు?" అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్వెస్లీ ప్రశ్నించారు. సిద్దిపేట జిల్లా దూల్మిట్ట మండలంలోని బైరాన్పల్లి గ్రామంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అసువులు బాసిన అమరవీరుల స్థూపానికి మంగళవారం జాన్వెస్లీ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి ర్యాలీగా బురుజు వద్దకు చేరుకున్నారు. అనంతరం బురుజుపై ఎర్రజెండాను ఆవిష్కరించారు. బురుజు ముందు చుక్కరాములు సిపిఎం జెండాను ఎగురవేశారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన అమరవీరుల సంస్మరణ సభలో జాన్వెస్లీ ప్రసంగించారు.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నైజాం పాలనకు వ్యతిరేకంగా.. రజాకార్లు, భూస్వాములు, దేశముఖ్లకు వ్యతిరేకంగా, ప్రజలకు అండగా సాగిందని తెలిపారు. కమ్యూనిస్టులు ప్రాణాలను త్యాగం చేసి పోరాడారని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలను ఐక్యం చేసి కుల మతాలకతీతంగా నడిపిన గొప్ప వర్గ పోరాటం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమన్నారు. రజాకార్లు

అమరుల స్థూపానికి నివాళులర్పిస్తున్న నేతలు

గ్రామాలపై దాడులు చేసి.. ఒకేరోజు 96 మందిని బైరాన్పల్లి బురుజు వద్ద, కూటిగల్ గ్రామంలో 22 మందిని కాల్చి చంపారని, ఊచకోత కోశారని గుర్తు చేశారు. అయినా, ప్రజలు వెనకడుగు వేయకుండా కమ్యూనిస్టుల నాయకత్వంలో ఎర్రజెండా చేతబట్టుకుని పోరాడారని కొనియాడారు.

పోరాటాన్ని వక్రీకరించి లబ్ది పొందే యత్నం

ఈ ప్రాంతంలోని ప్రతి గ్రామంలో త్యాగాల చరిత్ర ఉందని జాన్వెస్లీ తెలిపారు. బిజెపి, ఆర్ఎస్ఎస్ ఈ పోరాటాన్ని వక్రీకరించి రాజకీయ లబ్ది పొందాలని దొంగ నాటకాలు ఆడుతున్నాయని విమర్శించారు. ఇలాంటి వారికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి వారసులమైన కమ్యూనిస్టులుగా.. నాటి నుంచి నేటి వరకు అన్ని వర్గాల ప్రజల పక్షాన పోరాడుతుంది ఎర్రజెండా మాత్రమేనన్నారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం కార్మికులు, రైతులు, కూలీలు వృత్తిదారులు, అన్ని వర్గాల ప్రజలను ఐక్యం చేసి ఉద్యమాలు నిర్మిస్తామని తెలిపారు.

హామీలను అమలు చేయని రాష్ట్ర ప్రభుత్వం

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేముందు ప్రజలకు అనేక హామీలు ఇచ్చిందని, ఏ ఒక్క హామీని పూర్తిగా అమలు చేయడం లేదని జాన్వెస్లీ అన్నారు. బైరాన్పల్లి గ్రామాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని, అర్హులైన పోరాటయోధులందరికీ పింఛన్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బైరాన్పల్లి గ్రామంలో అర్హులుగా గుర్తించిన వారికి కూడా పింఛన్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. అంతకుముందు వల్లంపట్ల గ్రామంలో వేల్పుల దేవయ్య స్థూపానికి జాన్వెస్లీ, చుక్క రాములు పూలమాలవేసి నివాళులర్పించారు.

ఈ సభలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఉడుత రవీందర్, సీనియర్ నాయకులు నక్కల యాదవరెడ్డి, సిద్దిపేట జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కాముని గోపాలస్వామి, రాళ్ల బండి శశిధర్, శెట్టిపల్లి సత్తిరెడ్డి, గొడ్డుబర్ల భాస్కర్, నాయకులు కొంగరి వెంకట మావో, ఆలేటి యాదగిరి, బండ కింది అరుణ్ కుమార్, తాడూరి రవీందర్, బద్దిపడగ కృష్ణారెడ్డి, చొప్పరి రవికుమార్, అత్తిని శారద, జాలిగపూ శిరీష, అమ్ముల బాల నరసయ్య, దాసరి ప్రశాంత్, చేర్యాల పట్టణ కార్యదర్శి రాళ్ల బండి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

సాయుధ రైతాంగ పోరాటానికి మతం రంగు

- బిజెపిని తరిమికొట్టాలి : అబ్బాస్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

నిజాం, భూస్వాముల దోపిడీ.. వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా సామాన్యులను చైతన్యపరిచి సాయుధ రైతాంగ పోరాటం నిర్వహించిన చరిత్ర ఎర్రజెండాదేనని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా సిపిఎం హైదరాబాద్ సౌత్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం శాలిబండ నుంచి చార్మినార్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం చార్మినార్ వద్ద నిర్వహించిన బహిరంగసభలో ఆయన మాట్లాడారు. ఆనాటి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం వహించిందన్నారు. ఆ పోరాటం వల్లే చివరకు నైజాం రాజు దిక్కుతోచక భారత ప్రభుత్వంతో రాజీ కుదుర్చుకున్నాడన్నారు. దానిలో భాగంగా ఆనాటి కేంద్ర హోం మంత్రి వల్లభాయ్ పటేల్ నిజాం రాజుకు రాజభరణం ఇచ్చారని, ఇది చరిత్ర అన్నారు. ఈ వాస్తవాలను నేడు బిజెపి వక్రీకరించి ముస్లిం రాజు హిందు అయిన వల్లభాయ్ పటేల్కు లొంగిపోయినట్టు చెప్పున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ చార్మినార్ జోన్ కన్వీనర్ అబ్దుల్ సత్తార్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో నాయకులు ఎం.మీనా, జి.విటల్, పి.నాగేశ్వర్, ఎల్.కోటయ్య, ఎం.శ్రవణ్ కుమార్, ఎం.బాలు, బాబార్ ఖాన్, ఎస్.కిషన్, ఏ.కృష్ణ, కె.జంగయ్య పాల్గొన్నారు.

'ఆరోగ్యశ్రీ ' సేవలను నిలిపేస్తున్నాం

- డాక్టర్ వద్దిరాజు రాకేశ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తొమ్మిది నెలలుగా చేసిన ప్రయత్నాలు విఫలం కావడం, ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేస్తున్నట్టు తెలంగాణ ఆరోగ్యశ్రీ నెట్వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ వద్దిరాజు రాకేశ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక వీడియో సందేశం విడుదల చేశారు. ప్రభుత్వానికి వివిధ రూపాల్లో తమ సమస్యలను చెప్పినప్పటికీ పరిష్కారం కాకపోగా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టుగా పరిస్థితి ఉందని ఆయన తెలిపారు. లిఖితపూర్వకంగానూ, స్వయంగా కలిసి విన్నవించినప్పటికీ ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యారోగ్యశాఖ మంత్రికి, ఆరోగ్యశ్రీ సిఇఒకు ఆర్థిక ఇబ్బందులతో పాటు ఆర్థికేతర సమస్యలను పరిష్కరించాలని కోరినప్పటికీ ఎలాంటి మార్పు రాలేదని చెప్పారు. ప్రజలను ఇబ్బంది పెట్టే ఉద్దేశం తమకు లేదని స్పష్టం చేశారు.

నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి : ఉదయ్కుమార్

ఆరోగ్యశ్రీ సేవలు యథావిధిగా కొనసాగించాలని ప్రయివేటు ఆస్పత్రుల యాజమాన్యాలకు ఆరోగ్యశ్రీ సిఇఒ ఉదయ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. వైద్య సేవల నిలిపివేత నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆరోగ్యశ్రీ కింద ఉచిత వైద్య పరిమితిని రూ.ఐదు లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచడంతో పాటు, గడిచిన 21 నెలల్లో రూ.1,779 కోట్లను చెల్లించిందని వెల్లడించారు. ప్రయివేటు హాస్పిటళ్ల యాజమాన్యాలు దశాబ్దకాలం ఎదురుచూసిన ప్యాకేజీల ఛార్జీల పెంపు డిమాండ్ను ఆమోదించి, 1,375 వైద్య చికిత్సల ఛార్జీలను సగటున 22 శాతానికిపైగా పెంచిన విషయాన్ని గుర్తు చేశారు. కొత్తగా 163 రకాల ఖరీదైన వైద్య సేవలను ఆరోగ్యశ్రీలో చేర్చి పేషెంట్లను ప్రభుత్వం ఆదుకుందని పేర్కొన్నారు. 2014 నుంచి 2023 నవంబర్ వరకూ సగటున నెలకు రూ.57 కోట్లు హాస్పిటళ్లకు చెల్లించగా, 2023 డిసెంబర్ నుంచి 2024 డిసెంబర్ వరకూ సగటున నెలకు రూ.75 కోట్లు చెల్లించినట్టు తెలిపారు. ప్రస్తుతం నెలకు రూ.95 కోట్లు చెల్లిస్తున్నామనీ, హాస్పిటళ్ల యాజమాన్యాల విజ్ఞప్తి మేరకు నెలకు రూ.వంద కోట్లు చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించిందని వెల్లడించారు. ఇతర విజ్ఞప్తుల విషయంలోనూ ప్రభుత్వం సానుకూలంగా ఉందని తెలిపారు.

25న చలో సచివాలయ ముట్టడి

- సమస్యలపై స్పష్టతని ఇవ్వని ప్రభుత్వం : సిఐటియు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఈ నెల 25న తలపెట్టిన చలో సచివాలయ ముట్టడి యధావిధిగా కొనసాగుతుందని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.సునీత, పి.జయలక్ష్మి ప్రకటించారు. మంగళవారం హైదరాబాద్లో ఐసిడిఎస్ డైరెక్టర్ సృజన సమక్షంలో జరిగిన చర్చల్లో స్పష్టమైన హామీలు రాలేదని తెలిపారు. సుదీర్ఘంగా జరిగిన చర్చల్లో ప్రీ ప్రైమరీ పీఎం శ్రీ విద్య పైనా, వేతనాల పెంపు పైనా హామీలు రాలేదన్నారు. రిటైర్మెంట్ జీవో నం.8 సవరణ, మినీ టీచర్స్ ఏరియర్స్, 24 రోజుల సమ్మె వేతనాలు, పిఆర్సి ఏరియర్స్, సిబిఇ 10 నెలల బకాయిలు, కారుణ్య నియామకాలు, మట్టి ఖర్చులు, జీవో నెం 11 సవరణ చేసే విధంగా చూస్తామని మాత్రమే చెప్పారని తెలిపారు. ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలనీ, ఒకే ఆన్లైన్ యాప్ ఉండాలనీ, 5జీ నెట్వర్క్తో కూడిన మొబైల్ ఫోన్ ఇవ్వాలని కోరగా సానుకూలంగా స్పందిస్తూ 20 రోజుల్లో ఇస్తామని హామీనిచ్చారన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చర్చిస్తామన్నారు. ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని కోరగా పదో తేదీగా ఇస్తామని చెప్పారన్నారు. దసరా సెలవులపైనా స్పష్టత ఇవ్వలేదని తెలిపారు. సీనియార్టీ ప్రకారం వేతనాలు నిర్ణయించాలని కోరగా పరిశీలిస్తామంటూ దాటవేశారని చెప్పారు. ఒకే రకమైన నాణ్యమైన యూనిఫాం, బీఎల్ఓ డ్యూటీల రద్దు, సంక్షేమ పథకాలు అమలు, 2017 నుంచి ఆగిపోయిన టిఎ, డిఎలు, ఇంక్రిమెంట్ ఇంచార్జ్ అలవెన్సుల విషయంలోనూ పరిశీలిస్తామని మాత్రమే అన్నారన్నారు. చనిపోయిన వారికి రెండు లక్షల రూపాయల ప్రమాద బీమా అమౌంట్ అందట్లేదని తెలియజేయగా దానిపైనా చర్చించి ఎవరు చెల్లించాలనే అంశంపైన క్లారిటీ ఇస్తామని చెప్పారు. డిమాండ్లను నెరవేర్చే విషయంపై చూస్తాం..పరిశీలిస్తాం... పైస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్తాం అని మాత్రమే చెప్పారుగానీ స్పష్టమైన హామీ ఇవ్వలేదని విమర్శించారు. గతంలో తమ యూనియన్ ప్రకటించిన విధంగానే యధావిధిగా పోరాటాలు జరుగుతాయని స్పష్టం చేశారు. ఈ చర్చల్లో తమతో పాటు యూనియన్ రాష్ట్ర కోశాధికారి పి.మంగ, రాష్ట్ర సహాయ కార్యదర్శి స్వప్న, రాష్ట్ర ఉపాధ్యక్షులు సమ్మక్క, రాష్ట్ర కమిటీ సభ్యులు సీహెచ్ రమాకుమారి పాల్గొన్నారని తెలిపారు.

గంటల తరబడి నిరీక్షణ

- యూరియా కోసం బారులు తీరిన రైతులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యూరియా కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు. లైన్లో గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. పలుచోట్ల మంగళవారం ఉదయం నుంచి యూరియా కోసం రైతులు పడిగాపులు కాసినా.. దొరక్కపోవడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయం ముందు ఉదయం నుంచి రైతులు పట్టా పాస్బుక్కులతో ఆఫీస్ ముందు లైన్లో నిలబడ్డారు. 225 యూరియా బస్తాలు స్టాక్ ఉండటంతో ఒక్కొక్కరికి ఒక్కో బస్తా మాత్రమే వ్యవసాయ అధికారులు టోకెన్ నెంబర్ కేటాయించి అందజేశారు. అక్కడ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. భీంగల్ పట్టణంలోని రైతు సేవా సహకార సంఘానికి రైతులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. ఒక్కో రైతుకు రెండు బ్యాగుల చొప్పున వ్యవసాయ అధికారులు టోకెన్ ఇచ్చి పంపిణీ చేశారు. ఫోన్ నెంబర్ సహాయంతో ఓటీపీ తీసుకొని యూరియా అందజేశారు. పలువురికి ఓటీపీలు ఆలస్యంగా రావడంతో చిన్నపాటి తోపులాట జరిగింది. పోలీసులు వచ్చి సమస్యను పరిష్కరించారు.

కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండలంలోని లక్ష్మీదేవునిపల్లి, అంతంపల్లి గ్రామ సొసైటీ వద్ద తెల్లవారుజామునే రైతులు లైన్ కట్టారు. తాడ్వాయి మండలంలోని కృష్ణజివాడి, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో పోలీస్ పహారాతో యూరియా టోకెన్లు అందజేశారు. కృష్ణజివాడికి 222 బస్తాల యూరియా రాగా.. బ్రాహ్మణపల్లి రైతు వేదికలో 222 బస్తాల యూరియా కోసం అధికారులు పోలీసుల సహకారంతో రైతులకు టోకెన్లు పంపిణీ చేశారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలకేంద్రంలోని పీఏసీఎస్ ఎదుట రైతులు యూరియా కోసం బారులు తీరారు. పోలీసుల బందోబస్తు మధ్య పంపిణీ చేశారు.

కళాధర్ తరతరాల చేనేత వస్త్రాల సంప్రదాయం

- ఫౌండర్ రాచబతుని

హైదరాబాద్ : కళాధర్ కేవలం చీరల బ్రాండ్ మాత్రమే కాదని తరతరాలుగా వస్తున్న నేత సంప్రదాయాన్ని కాపాడుతూ, దానికి నేటి తరం అభిరుచులకు అనుగుణంగా కొత్త రూపు ఇవ్వాలనే ఉద్దేశంతో సంస్థను ప్రారంభించామని ఆ సంస్థ ఫౌండర్ కళాధర్ రాచబతుని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అత్యుత్తమ నాణ్యత, ప్రామాణికతతో నేటి తరానికి సరిపోయేలా సంప్రదాయ దుస్తుల షాపింగ్ అనుభవాన్ని అందిస్తున్నామన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో ఒంగోలు
FDP No :1/2025
IN
OS No : 389/2006
పల్లపోలు భాగ్యలక్ష్మి ఇతరులు ... పిటిషనర్
వర్సెస్
పల్లపోలు నాగేశ్వరమ్మ మరియు 8మంది ఇతరులు ... రెస్పాండెంట్స్
To
R7) వంగవీటి పద్మజ,
W/o వెంకట శాస్త్రి,
R/o కళ్యాణ్ పూరి, ఉప్పల్ పోస్ట్, హైదరాబాద్,
పైనెంబర్ గల దావాలో వాది (పిటీషనరు) ఎన్నిసార్లు మీకు నోటిసులు పంపినప్పటికీ తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున పై కోర్టు వారు పత్రికా ప్రకటనకు ఆర్డర్ వేసియున్నారు తేది 08-10-2025న ఉదయం గం 10.30 నిమిషాలకు మీరు స్వయంగా గాని లేదా మీతరపున వకీలు ద్వారా గాని పైకోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణ లు తెలియపరచుకొనగలరు లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది
// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
వాయిదా తేది : 08-10-2025
ఒంగోలు
తేది : 16-09-2025
ఇట్లు
కోలా శివప్రసాద్
అడ్వకేట్, ఒంగోలు
ప్రకాశం జిల్లా

మహారాజశ్రీ కందుకూరు సివిల్జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
H.M.O.P.No. 99 / 2024
బండారి అనిల్ - పిటిషనరు
Vs
బండారి కావ్య ఉరఫ్ ఈర్ల కావ్య - రెస్పాండెంట్
టు,
బండారి కావ్య ఉరఫ్ ఈర్ల కావ్య,
భర్త బండారి అనిల్, తండ్రి ఈర్ల కొండలరావు,
డోరు నెం.1-6, గుండ్ల రాజేశ్వర్ ఇల్లు,
కోటార్మూర్, పేర్కిట్, ఆర్మూరు మండలం,
నిజామాబాద్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం.
పై నెంబరులోని పిటిషనరు లోగడ తనకు మీతో జరిగియున్న వివాహాన్ని హిందూ వివాహ చట్టంలోని సెక్షన్స్ 13(1)(ia)(ib) లను అనుసరించి మీ నుండి తనకు విడాకులు మంజూరు చేయమని కోరుచూ, పై కోర్టు నందు ఈ పిటిషను దాఖలు పరచగా పై కోర్టు వారు మీకు పంపించిన నోటీసులు మీకు జారీ కానందున పై కోర్టు వారు మీకు నోటీసులు ఈ పేపరు ప్రకటన ద్వారా జారీ చేయమని సదరు కేసును **తేది: 23-10-2025**నకు వాయిదా వేసియున్నారు. కావున మీరు **తేది: 23-10-2025 ఉదయం గం॥ 10.30 నిముషములకు** పై కోర్టునందు స్వయంగా గానీ లేక మీ తరపు న్యాయవాది గారి ద్వారా గానీ హాజరుపడి మీరు తెల్పుకోవలసిన ఆక్షేపణలు తెల్పుకోవలెను. లేనియెడల ఈవ్యాజ్యం మీ పరోక్షమున తీర్మానించెదరని ఇందుమూలంగా మీ తెలియజేయడమైనది.
పై కోర్టువారి ఆదేశానుసారం
ఇట్లు
షేక్.మస్తాన్ వలి, బి.ఎ., ఎల్.ఎల్.బి.,
పిటిషనరు తరపు న్యాయవాది
కందుకూరు, ఎస్పిఎస్ఆర్ నెల్లూరు జిల్లా.

మహారాజ శ్రీ నంద్యాల 3వ అదనపు జిల్లా జడ్జ్ కోర్ట్ నందు
E.A.No. 395/2025 IN E.P. No: 209/2018
IN OS. No. 16/2015
గడ్డం రత్నస్వామి. ...క్లైమెంట్/ పిటీషనర్
V/s
1) బి.మద్దిలేటి స్వామి
2) వాక వాసుదేవరావు. ...రెస్పాండెంట్స్
To,
ఆర్ - 2 చిరునామా :
వాక వాసుదేవరావు, S/o. వి.రంగప్ప చైర్మెన్ & మేనేజింగ్ డైరెక్టర్, M/s. వి.వి.ఆర్.హోసింగ్ ఇండియా ప్రవేట్ లిమిటేడ్, ప్లాట్ నెం. 207 & 21, 2వ అంతస్తు, పవారి ప్రిస్టేజ్, హైదరాబాద్.
రెస్పాడెంట్స్ కు అప్లికేషన్ నోటీసు
పిటీషనరు, పై తెలిపిన E.P. నందు, షెడ్యూల్ ధాఖలా భూమికి తాను మరియు ఇంకొందరు హక్కుదారులని హక్కును క్లైమ్ చేస్తూ క్లైమ్ అప్లికేషను వేసి, క్లైమ్ అప్లికేషన్ తో పాటు పై తెలిపిన E.A No.395/2025 ను కూడా ఫైల్ చేసినారు. అందులో మిమ్ములను 2వ రెస్పాండెంట్ గా చూపించినారు. సదరు అప్లికేషన్ లో మీయొక్క హాజరు నిమిత్తము 23-09-2025 వ తేదీన ఉదయం 10:30 గం॥లకు పై కోర్టునందు మీరు స్వయంగా కానీ లేదా మీ వకీలు ద్వారా కానీ హాజరై ఆక్టేపనలు ఏమైనా ఉంటే తెలుపుకోవలెను లేనియడల మీకు పరోక్షముగా అప్లికేషన్ ను తీర్మానించెదరు.
(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది: 23-09-2025.
(బి. రామమోహన్ రెడ్డి),
పిటిషనర్ తరుపు న్యాయవాది,
నంద్యాల
Cell: 9440112592

విప్లవాల గడ్డపై వీరత్వాన్ని గానం చేద్దాం

- కవి గాయక సమ్మేళనంలో వక్తలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

విప్లవాల గడ్డపై వీరత్వాన్ని గానం చేద్దామని కవి గాయక సమ్మేళనంలో వక్తలు అన్నారు. చరిత్రను వక్రీకరిస్తే చెత్త బుట్టలో కలిసిపోతారన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం యాదిలో తెలంగాణ సాహితి, టిపిఎస్కె సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ బాగ్లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సభకు తెలంగాణ సాహితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఆనందాచారి, టిపిఎస్కే రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆనందాచారి మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమంటే ఎందరో వీరుల నెత్తుటి త్యాగాలతో తడిసిన చరిత్ర అని అన్నారు. సాయుధ పోరాటానికి వక్రీకరణ జరుగుతున్న ఈ తరుణంలో అసలైన చరిత్రను నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత కవులు, కళాకారులపై ఉందని తెలిపారు. తెలంగాణ నేల పోరాటాల గడ్డ అని, ఈ నేలపై గ్రంథాలయ ఉద్యమం ద్వారా ప్రారంభమైన ఉద్యమం ఆంధ్రమహాసభ ద్వారా భాషా సాంస్కృతిక విధానాలు కూడా రాజకీయాలతో ముడిపడి ఉందని తెలియజేసిందని చెప్పారు. బాంఛన్ అన్న నోటితోనే నీ ఘోరీ కడతాం కొడకా అనేలా చేసింది తెలంగాణ నేల అన్నారు. తెలంగాణ ప్రాంతం వారే కాదు.. కలకత్తా నుంచి చిత్త ప్రసాద్ తన చిత్రాలతో, హరేంద్రనాథ్ చటోపాధ్యాయ గీతాలు, ఆంధ్ర నుంచి ఆవంత్స సోమసుందర్, సుంకర, ఆరుద్ర వంటి వారు వారి కావ్యాలతో సంఘీభావం తెలిపారని గుర్తు చేశారు.భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటానికి మతం రంగు పులమడం సరైంది కాదన్నారు. నైజాం కాలంలోనే షోయబుల్లాఖాన్ అత్యంత దారుణంగా హత్యకు గురయ్యారన్నారు. మఖ్దూం ఇక్కడే కామ్రేడ్ అసోసియేషన్ను ఏర్పాటు చేశారని, దాశరథి, వట్టికోట ఆళ్వారుస్వామి వంటి సాహిత్యకారులు, సుద్దాల హనుమంతు వంటి వాగ్గేయకారులు ఆ

పోరాటంలో ప్రజలను చైతన్యం చేశారని తెలిపారు. ఈ సందర్భంగా "నేను సైతం వీర తెలంగాణ పోరాట సంస్కృతితో ముందుకెళ్తాను.. నేలకొరిగిన అమరవీరుల సాక్షిగా అనుక్షణం నవతెలంగాణ నిర్మాణానికై పని చేస్తాను. నేను సైతం సమసమాజ స్థాపన ఉద్యమంలో నిండిపోతాను. చరిత్ర వక్రీకరణలు, కల్లబొల్లి కబుర్లు, ఉత్తి మాటలు, ఉట్టెక్కిన ఆశలు, రాజకీయ ఎత్తులు, సాంస్కృతిక దాడులు.. ఇక వద్దు.. నా తండ్రులు ఎదిరించిన నాటి శత్రువే నేటికీ ఈనాడు నీచంగా హీనంగా పీల్చి పిప్పి చేస్తుంటే.. ఇంకానా ఇకపై సాగదు. నేను సైతం వీర తెలంగాణ పోరాట ఆశయాలకు ఊపిరినవుతాను.. భావితరాలకు బాటనవుతాను. భావ ప్రకటన స్వేచ్ఛ, ప్రజాతంత్ర ఐక్య ఉద్యమాలకు ఊతమవుతాను" అంటూ కవులు, రచయితలందరూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవులు వనపట్ల సుబ్బయ్య, ప్రముఖ రచయిత సామిడి జగన్రెడ్డి, మోహన్ కృష్ణ, ఎంవీ రమణ, సలీమా, బండి సత్తన్న, శరత్ చంద్ర అనుముల ప్రభాకర్, ఉదయగిరి మధుబాబు, గెరా ముజాహిదీన్, రేఖా, సునిత పాల్గొన్నారు.

సంప్రదాయం, ఆధునికతల మేళవింపుగా 'బతుకమ్మ'

- సకల జనులతో ఉత్సవాలు
- సమీక్షలో మంత్రి జూపల్లి కృష్ణారావు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సంప్రదాయం, ఆధునికతల మేళవింపుగా అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబరాలను నిర్వహించేందుకు సన్నహాలు చేస్తున్నట్టు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కష్ణారావు తెలిపారు. బేగంపేటలోని టూరిజం ప్లాజాలో బతుకమ్మ పండుగ నిర్వహణ, ముందస్తు ఏర్పాట్లపై మంత్రి జూపల్లి కష్ణారావు సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. గ్రామాలతోపాటు హైదరాబాద్లోనూ అత్యంత వైభవంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, పర్యాటక, చారిత్రక ప్రాంతాలను ముస్తాబు చేయాలనీ, అక్కడ సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని దిశానిర్దేశం చేశారు. బతుకమ్మపై ప్రత్యేక గీతాలు, మన సంస్కృతి, సాంప్రదాయలు ఉట్టిపడేలా, ప్రకతి, పర్యాటకం, పర్యావరణం థీమ్ రూపకల్పన చేయాలన్నారు. వీటిని ప్రతీ ఒక్కరూ కాలర్ ట్యూన్స్, సోషల్ మీడియా స్టేటస్గా పెట్టుకోవాలని కోరారు. ఉత్సవాల నిర్వహణ అనంతరం పూలు, ఇతర సామాగ్రిని వధాగా పారబోయకుండా వాటితో పర్యావరణహిత వస్తువులు తయారు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నెల 21 నుంచి 30 వరకు జరగనున్న వేడుకలను.. మరోసారి లోకానికి చాటి చెప్పేందుకు సన్నాహాలు చేయాలన్నారు. విస్తృతంగా ప్రచారం చేపట్టాలని కోరారు. ఈ నెల 21వ తేదీన వరంగల్లోని చారిత్రాత్మక వేయి స్తంభాల గుడి వద్ద బతుకమ్మ ప్రారంభోత్సవాన్ని దిగ్విజయంగా జరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. హైదరాబాద్లోని కొన్ని ఎంపిక చేసిన జంక్షన్లతో పాటు టూరిజం హోటళ్లు, రైల్వే, బస్ స్టేషన్లు, విమానాశ్రయాలు, విశ్వవిద్యాలయాల్లోనూ సాంప్రదాయ బతుకమ్మ ప్రతిమలు నెలకొల్పాలని అన్నారు. విద్యార్థులంతా బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొనేలా కళాశాల, యూనివర్సిటీ అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లా కలెక్టర్లు పండుగ దిగ్విజయంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ సమీక్షలో పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ జయేష్రంజన్, వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ సభ్యురాలు భవానిరెడ్డి, వైశ్య కార్పొరేషన్ చైర్పర్సన్ కాల్వ సుజాత, స్టేట్ ఆర్ట్ గ్యాలరీ గ్యాలరీ డెరెక్టర్ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

IV-COURT IN THE COURT OF SMALL CAUSES COURT OF CHENNAI-104
MCOP. No: 1189 of 2025
Jaya Prakash, ... Petitioner
-Vs-
1. Kakatiya Industrial,
2. National Insurance Co Ltd.,
... Respondents
To,
Kakatiya Industrial
S/o. Basava Narendra Babu
No. 8. Mini Industrial Estate,
Hafeezpet, Miyapur, Hyderabad,
Telangana-500 049.
This is to inform you that my client as well as have preferred above MCOP. No. 1189 of 2025 before the Hon'ble IV-Court Judge, Motor Accident Claims Tribunal, Small Causes Court, Chennai, This Hon'ble Judge was ordered private notice in paper publication to the respondents the matter returnable by Please take notice and you should appear in person in through your counsel before the Hon'ble IV-Court JUDGE, Small Causes Court, Chennai on by 06.10.2025 at 10:00 A.m. Failing which mater will be decided as Expert in your absence.
K. Pranava Kumar,
Counsel for Petitioner.

మానవీయ కోణంలో భూ సమస్యలకు పరిష్కారం

రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దశాబ్దాల కాలంగా భూములను సాగుచేసుకుంటున్న వారికి హక్కులు కల్పించే విషయంలో మానవీయ కోణంలో ఆలోచన చేయాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు సూచించారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సచివాలయంలో మంగళవారం నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని భూ సమస్యలపై అటవీ శాఖ మంత్రి కొండా సురేఖతో కలిసి మంత్రి పొంగులేటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. చిన్న చిన్న సమస్యలను జఠిలం చేయొద్దని అటవీశాఖ అధికారులకు సూచించారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో 40-50 ఏండ్ల నుంచి సాగు చేసుకుంటున్న భూములపై గిరిజనులకు హక్కులు కల్పించడానికి తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. అయితే వివిధ నిబంధనలు చూపుతూ ఆ భూములు అటవీ శాఖకు చెందినవని అధికారులు కొర్రీలు పెడుతున్నారన్నారు. ఈ అంశంపై రెవెన్యూ, ఫారెస్ట్ విభాగాలు సమన్వయంతో పనిచేసి వీలైనంత త్వరగా పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూభారతి పైలట్ ప్రాజెక్టులో భాగంగా నాగార్జునసాగర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని తిరుమలగిరి (సాగర్) మండలాన్ని ఎంపిక చేసి ప్రయోగాత్మకంగా సర్వే నిర్వహించామన్నారు. ఈ పైలట్ ప్రాజెక్ట్ కోసం 235 సర్వే నెంబర్లను ఎంపిక చేసినట్టు చెప్పారు.

'హెచ్‌ఎస్‌ఆర్‌పి' హైరానా!

- హై సెక్యూరిటీ నెంబర్ ప్లేట్ బిగించుకోవాలని ప్రచారం
- ఈనెల 30వ తేదీ డెడ్‌లైన్ అంటూ.. ఫేక్ జీవో కలకలం!
- నిజమేనని నమ్మి.. వివరాలు నమోదు చేసుకుంటున్న వాహనదారులు
- ఇదే అదునుగా అందినకాడికి దోచుకుంటున్న హ్యాకర్లు
- మోసపోయామని గుర్తించి ఆర్‌టిఎ అధికారులకు ఫిర్యాదు
- ప్రభుత్వ ఆదేశాలు లేకపోవడంతో చేతులేత్తేస్తున్న రవాణాశాఖ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వాహనాలకు హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్లు తప్పనిసరంటూ జరుగుతున్న ప్రచారం వాహనదారులను హైరానాకు గురిచేస్తోంది. పాత, కొత్త అనే తేడా లేకుండా అన్ని వాహనాలకు హెచ్‌ఎస్‌ఆర్‌పి ఉండాలని ప్రభుత్వం నిర్ణయించిందనీ, ఆ మేరకు జిఒ జారీ అయినట్టు కొద్దినెలలుగా వివిధ మాధ్యమాల్లో పెద్దఎత్తున్న ప్రచారం జరుగుతోంది. అంతేగాక ఈనెల (సెప్టెంబరు) 30వ తేదీ తుదిగడువు విధించిందంటూ పేర్కొంది. ఆ వార్త నిజమేనని నమ్మిన రాష్ట్రంలోని చాలామంది వాహనదారులు హెచ్‌ఎస్‌ఆర్‌పి పేరుతో కనిపించిన వెబ్‌సైట్‌లోకి వెళ్లి తమ వాహనాల వివరాలు నమోదు చేసి.. డబ్బులు చెల్లిస్తున్నారు. రోజులు గడిచిపోతున్నా వాహన నంబర్ ప్లేట్ రాకపోవడంతో సదరు వాహనదారులు రవాణాశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇది హ్యాకర్ల పనిగా గుర్తించిన అధికారులు పోలీసులకు కంప్లైంట్ చేసి చేతులు దులుపుకున్నారు. ఈ విషయంలో రవాణాశాఖ ఉన్నతాధికారులు ఎలాంటి నష్ట నివారణా చర్యలు చేపట్టకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. తమకు ఏ మాత్రం పట్టనట్టుగా వ్యవహరిస్తుండటంతో విమర్శలకు గురికావాల్సి వస్తుంది.

గ్రేటర్ పరిధిలో రవాణా శాఖకు 11 ఆర్‌డిఎ కార్యాలయాలు ఉండగా.. రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన, యూనిట్ ఆఫీస్‌లు కలిపి 54 ఉన్నాయి. ఇక్కడ నిత్యం వేల సంఖ్యలో వాహనాల రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. కాగా ప్రస్తుతం కొత్త వాహనాలకు షోరూంలోనే హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్లు బిగిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ ఏడాది ఏప్రిల్ 9న రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసినట్టుగా సృష్టించిన నకిలీ జిఒ ఒకటి ప్రచారంలోకి వచ్చింది. సదరు జిఒ ప్రకారం 2016 ఏప్రిల్‌కు ముందు తయారైన వాహనాలకు హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్లను బిగించాలనేది సారాంశం. వాస్తవానికి కొత్త నంబర్ ప్లేట్లను బిగించుకోవాలనుకునే వాహనదారులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎస్ఐఎఎం.ఇన్ వెబ్‌సైట్‌లో వాహనం వివరాలను నమోదు చేసుకొని బుక్ చేసుకోవాలి. కానీ ఈ సైట్ మన రాష్ట్రంలో ఇంకా వినియోగంలోకి రాలేదని తెలిసింది. ఇది తెలియని చాలామంది వాహనదారులు హెచ్‌ఎస్‌ఆర్‌పి కోసం అందులోకి వెళ్లి జేబులు గుల్ల చేసుకొని లబోదిబోమంటున్నారు.

ఇటీవల ఇద్దరు నిమ్స్ ఆస్పత్రికి చెందిన డాక్టర్లు తమ వాహనాలకు హెచ్‌ఎస్‌ఆర్‌పి నంబర్ కోసమని సదరు సైట్‌లో వివరాలు నమోదు చేసి.. డబ్బులు చెల్లించారు. వారం రోజులు గడుస్తున్నా.. నంబర్ ప్లేట్ ఇంటికి రాకపోవడంతో.. ఆర్‌టిఎ అధికారులను సంప్రదించారు. అధికారులు చెప్పిన సమాధానంతో అది నకిలీ జిఒ అని నిర్ధారణకు వచ్చారు. చేసేదేమీ లేక వెనుదిరిగి వెళ్లిపోయారు. ఇలాంటివి రోజుకు అనేకం వస్తున్నాయి. ఇదిలావుంటే ఇదే అంశంపై మరో ప్రచారం ఇలా ఉంది. 2019 ముందు వాహనాలకు హెచ్‌ఎస్‌ఆర్‌పి నంబర్ ప్లేట్ బిగింపునకు సంబంధించిన జిఒ రవాణాశాఖ సిద్ధం చేసి.. ముఖ్యమంత్రి ఆమోదానికి పంపించగా.. అందుకు సిఎం నిరాకరించినట్టు సమాచారం. అయితే అప్పటికే ఆ శాఖ అధికారుల్లో ఒకరు సదరు జిఒను లీక్ చేయడంతో అన్ని మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. అధికారుల చేయి దాటిపోయింది. అయితే దీనిపై అధికారులు ఒక స్టేట్‌మెంట్ ఇవ్వకుండా సైలెంట్ అయిపోయారు. మరోవైపు వాహనదారులు ఈ విషయం తెలియక హెచ్‌ఎస్‌ఆర్‌పి నంబర్ ప్లేట్ కోసం డబ్బులు పోగొట్టుకుంటున్నారు. ఇప్పటికైనా రవాణాశాఖ ఈ విషయంపై వాహనదారులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

హెచ్‌ఎస్‌ఆర్‌పి లేకపోతే..

హెచ్‌ఎస్‌ఆర్‌పి నంబర్ ప్లేట్ లేకపోతే వాహనం విక్రయించడం సాధ్యం కాదు. రవాణాశాఖ, పోలీసుల తనిఖీల్లో పట్టుబడితే కేసులు నమోదవుతాయి. బీమా, కాలుష్య ధ్రువపత్రాలు జారీచేయరు. రిజిస్ట్రేషన్ మార్పు జరగదు. అనుకోని ప్రమాదం జరిగినపుడు తగిన సహాయం పొందడం కష్టమవుతుంది. వాస్తవానికి హెచ్‌ఎస్‌ఆర్పీ విషయంలో ప్రభుత్వం ఇప్పటికైతే ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదు. కాబట్టి ఈనెల 30 తుది గడువు అంటూ జరుగుతున్న ప్రచారాన్ని నమ్మవద్దని అధికారులు సూచిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలు వచ్చేంత వరకు వాహనదారులు వేచి చూడాలని హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సి.రమేష్ కోరారు.

విలేకర్ల సమావేశంలో అభ్యర్థుల తల్లిదండ్రులు

మా పిల్లల భవిష్యత్‌తో రాజకీయాలు వద్దు

- నిరాధార ఆరోపణలు జీవితాలను చిన్నాభిన్నం చేస్తాయి
- గ్రూప్-1 క్వాలిఫైడ్ అభ్యర్థుల తల్లిదండ్రుల ఆవేదన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"మా పిల్లల భవిష్యత్‌తో రాజకీయాలు వద్దు. నిరాధార ఆరోపణలతో జీవితాలను చిన్నాభిన్నం చేయొద్దు" అంటూ గ్రూప్- క్వాలిఫైడ్ అభ్యర్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రూ.మూడు కోట్లు ఇచ్చి ఉద్యోగాలు కొనుక్కున్నారని కొందరు ఆరోపణలు చేస్తున్నారని, అది నిరూపించాలని సవాల్ విసిరారు. "మాకు అంత స్థోమతే లేదు.. అప్పులు చేసి, పూట గడవని పరిస్థితుల్లోనూ ఎన్నో త్యాగాలు చేసి పిల్లలను చదివించాం. ఇప్పుడు మా పిల్లల విజయాన్ని రాజకీయ లబ్ధి కోసం మసకబార్చకండి" అని విజ్ఞప్తి చేశారు. పోస్టులు కొనుక్కున్నామన్న ఆరోపణలపై ఎలాంటి విచారణకైనా తాము సిద్ధంగా ఉన్నామని, అదే నిజమని తేలితే తమకు ఉద్యోగాలు అవసరం లేదని, ఆత్మహత్యకైనా తాము సిద్ధమని అన్నారు. తమ పిల్లలు కష్టపడి సాధించిన విజయంపై అసత్య ప్రచారాలతో మనోధైర్యాన్ని దెబ్బతీయొద్దని కోరారు. పాచి పనులు, కూలి పనులు చేసుకుంటూ బతికే తాము మూడు కోట్లు ఇచ్చామంటే ఎవరు నమ్ముతారని, వాటికి ఎన్ని సున్నాలుంటాయో కూడా తెలియదని అన్నారు. తమ పిల్లలు ఎంతో కష్టపడి గ్రూప్-1 ర్యాంక్ సాధించారని, కొన్ని ఇన్‌స్టిట్యూట్‌లు వారిని సన్మానం పేరుతో తీసుకెళ్లి ఈ కుట్రలో భాగస్వాములు అయ్యారేమో అని అనుమానాన్ని వ్యక్తపరిచారు. తమకు న్యాయస్థానంపై పూర్తి నమ్మకం ఉందన్నారు. హైకోర్టు తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జంగారెడ్డి, లలిత, ఆనంద్ కుమార్, సీతా, పావని, సోనియా తదితరులు పాల్గొన్నారు.

త్వరలో మహిళా పాలసీ

- మంత్రులు కొండా సురేఖ, సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమాజంలో మహిళల పాత్ర కీలకమైనదని, వారి కోసం త్వరలో ఒక పాలసీ రూపొందిస్తామని రాష్ట్ర మంత్రులు డాక్టర్ డి. అనసూయ (సీతక్క), కొండా సురేఖ అన్నారు. తమ ప్రభుత్వం మహిళా సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందనీ, ప్రభుత్వ మహిళా ఉద్యోగులు సమర్థవంతంగా విధులు నిర్వహించి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల ఫలితాలను ప్రజలకు అందించే దిశలో పని చేయాలని కోరారు. మంగళవారం హైదరాబాద్‌లో తెలంగాణ సచివాలయ మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం లోగో ఆవిష్కరించారు. మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కమిటీతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. మహిళలకు ఎన్నో సవాళ్లున్నప్పటికీ విధి నిర్వహణలో అద్భుతంగా రాణిస్తున్నారని కొనియాడారు. మహిళకు ఉద్యోగం అంటేనే అదనపు బాధ్యత అనీ, ఒకవైపు కుటుంబ బాధ్యతలు మరొకవైపు వృత్తి బాధ్యతలను ఏకకాలంలో నిర్వర్తిస్తున్న మహిళా ఉద్యోగులను ప్రశంసించారు. మహిళలు తమ ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం కూడా చూసుకోవాలన్నారు. అన్ని రంగాల్లో మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లను చర్చించేందుకు మహిళ ఉద్యోగులందరితో ఈనెల 22న రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేసి వారు ఇచ్చే సూచనలు, సలహాల మేరకు ఒక నూతన మహిళా పాలసీ తీసుకొచ్చే ప్రయత్నం చేస్తామన్నారు. రాష్ట్రంలో మహిళా సంఘాలు 67 లక్షల మంది మహిళలతో పని చేస్తున్నాయనీ, వివిధ రంగాలలో మహిళా స్వయం సహాయక బృందాలు అద్భుతాలు సృష్టిస్తున్నాయని చెప్పారు. మహబూబ్ నగర్ జిల్లాలో పెట్రోల్ బంకుల నిర్వహణ ద్వారా కేవలం ఒక నెలలో 13 లక్షల రూపాయలు ఆర్జించాయని వివరించారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ...సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం, వారి సమస్యలను పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ లక్ష్యాలు, పథకాలు విజయవంతం కావడానికి ప్రభుత్వ ఉద్యోగుల కృషి కీలకమన్నారు. సమావేశంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, మహిళా ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రమాదేవి, సంఘం సభ్యులు శైలజ, మంగ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

'బియ్యం' కోసం ఏడు కిలోమీటర్లు

- వృద్ధులు సైతం కాలినడకన రేషన్ తెచ్చుకోవాల్సిన పరిస్థితి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

జయశంకర్- భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం చంద్రుపల్లి, నాగపెల్లి గ్రామాల పరిధిలో సుమారు 400 రేషన్ కార్డులు (ఎస్‌సి, ఎస్‌టి) ఉన్నాయి. కానీ, అక్కడ రేషన్ షాపు లేదు. కాలినడకన ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న అన్నారం గ్రామపంచాయతీకి వెళ్లి రేషన్ బియ్యం, నిత్యావసర సరుకులు తెచ్చుకోవాలి. ఐదేళ్ల కిందట అప్పటి సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామానికి సంబంధించిన రేషన్ బియ్యాన్ని గ్రామపంచాయతీ ట్రాక్టర్ ద్వారా తీసుకొచ్చి పంపిణీ చేసేవారు. పాలకవర్గం పదవీకాలం పూర్తవ్వడంతో కార్యదర్శి పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామ పంచాయతీకి సరిపడా నిధులు లేవని, పై అధికారులకు వివరించామని చెబుతున్నారని వాపోతున్నారు. ఉమ్మడి అన్నారం గ్రామ పంచాయతీకి వెళ్లే మార్గమధ్యలో లో లెవెల్ వంతెనపై నీరు చేరడంతో కెనాల్ కాల్వ ద్వారా సుమారు ఏడు కిలోమీటర్లు కాలినడకన వెళ్లి రేషన్ తెచ్చుకుంటున్నామని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం డీలర్‌ని నియమించి తమ గ్రామ పంచాయతీలోనే రేషన్ సరుకులు ఇవ్వాలని స్థానిక మంత్రి డి.శ్రీధర్ బాబును, జిల్లా కలెక్టర్‌ను రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కాలినడకన వెళ్లి బియ్యం తెచ్చుకుంటున్న వృద్ధులు

గల్ఫ్ కార్మికులకు, ఎన్నారైలకు అండగా 'సిఎం ప్రవాసీ ప్రజావాణి'

- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

విదేశాల్లో నివసిస్తున్న తెలంగాణ వాసులకు సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆపన్నహస్తం అందిస్తున్నదని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు, సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి జి చిన్నారెడ్డి అన్నారు. మంగళవారం బేగంపేటలోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన 'సిఎం ప్రవాసీ ప్రజావాణి' ప్రథమ వార్షికోత్సవ సభలో ఆయన మాట్లాడారు. తెలంగాణ డయాస్పొరా (ప్రవాసుల)కు, వారి కుటుంబాలకు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు, భారత రాయబార కార్యాలయాలకు 'ప్రవాసీ ప్రజావాణి' ఒక బలమైన వారధిగా, అనుసంధాకర్తగా పని చేస్తున్నదని సీఎం ప్రజావాణి నోడల్ అధికారి, సీనియర్ ఐఎఎస్ దివ్యా దేవరాజన్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని ఎన్నారై అడ్వయిజరీ కమిటీ చైర్మెన్ డాక్టర్ బిఎం వినోద్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి, సభ్యులు సింగిరెడ్డి నరేష్‌రెడ్డి, చెన్నమనేని శ్రీనివాసరావు, గుగ్గిల్ల రవిగౌడ్, స్వదేశ్ పరికిపండ్ల, ప్రవాసీ ప్రజావాణి కో-ఆర్డినేటర్ బొజ్జ అమరేందర్‌రెడ్డి, లండన్ ఎన్నారై రంగుల సుధాకర్ గౌడ్, ఎమిగ్రేంట్స్ వెల్ఫేర్ ఫోరం ప్రతినిధి మహ్మద్ బషీర్ అహ్మద్, గల్ఫ్ సినిమా దర్శకులు పి సునీల్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాక్సివిజన్ 65 హాస్పిటళ్లకు విస్తరణ

ప్రజాశక్తి - హైదరాబాద్

నేత్ర వైద్య రంగంలో ప్రఖ్యాత సంస్థ మాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పిటల్స్ దేశంలో 65 హాస్పిటల్స్‌కు విస్తరించింది. హైదరాబాద్‌లో 13వ హాస్పిటల్‌ను తెరిచింది. నగరంలో పెరుగుతున్న జనాభాకు ప్రపంచ స్థాయి కంటి సంరక్షణ సేవలను అందించడంలో తమ నిబద్ధతకు ఇది నిదర్శనమని ఆ సంస్థ పేర్కొంది. కొంపల్లిలో ఏర్పాటు చేసిన ఈ హాస్పిటల్‌ను మంగళవారం ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణ రాజు, మాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పిటల్స్ వ్యవస్థాపకుడు, కో చైర్మన్ డాక్టర్ కాసు ప్రసాద్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. "హైదరాబాద్ ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలకు మరో నూతన జోడింపుగా ఈ కొత్త మైలురాయి హాస్పిటల్ కేంద్రాన్ని ప్రారంభించడం నాకు సంతోషంగా ఉంది. నగరంలో ముఖ్యంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న కొంపల్లి ప్రాంతంలో మాక్సివిజన్ 13వ కేంద్రాన్ని ప్రారంభించడం, ప్రజా సంక్షేమం , ప్రగతిశీల వైద్య సేవల పట్ల లోతైన నిబద్ధతను ప్రతిబింబిస్తుంది." అని రఘు రామకృష్ణ రాజు పేర్కొన్నారు. "మా కొంపల్లి కేంద్ర ప్రారంభం ఇది అసాధారణమైన కంటి సంరక్షణకు అవకాశాలను విస్తరించాలనే మా అచంచలమైన లక్ష్యం ప్రతిబింబిస్తుంది. ఈ కేంద్రం అధునాతన డయాగ్నస్టిక్ టెక్నాలజీలు, శస్త్రచికిత్సా నైపుణ్యం కలిగి ఉంది. " అని కాసు ప్రసాద్ రెడ్డి అన్నారు.

నగరంలో జోస్ అలుక్కాస్ సిగ్నేచర్ జ్యువెలరీ షో ఏర్పాటు

హైదరాబాద్ : ప్రముఖ అభరణాల రిటైల్ చెయిన్ జోస్ అలుక్కాస్ నగరంలోని గ్రీన్‌ల్యాండ్స్ రోడ్ షోరూంలో సిగ్నేచర్ జ్యువెలరీ షో'ను ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. దీన్ని అక్టోబర్ 5 వరకు నిర్వహించనున్నట్లు తెలిపింది. ఈ షోను జోస్ అలుక్కాస్ మేనేజింగ్ డైరెక్టర్ జాన్ అలుక్కాస్ ప్రారంభించారు. కస్టమర్లకు ప్రతి డైమాండ్స్ కొనుగోలుపై క్యారెట్‌కు 20 శాతం తగ్గింపు, 500 మిల్లీ గ్రాము బంగారు నాణెం ఉచితంగా పొందవచ్చని పేర్కొంది.

సికింద్రాబాద్‌లో మెడికవర్ హాస్పిటల్ ప్రారంభం

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

ప్రముఖ వైద్య సేవల చెయిన్ మెడికవర్ హాస్పిటల్స్ మంగళవారం సికింద్రాబాద్‌లో కొత్త హాస్పిటల్‌ను ఏర్పాటు చేసింది. ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, తెలంగాణ రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహా, పొన్నం ప్రభాకర్, జిహెచ్‌ఎంసి మేయర్ గద్వాల విజయలక్ష్మి పాల్గొన్నారు. ఈ హాస్పిటల్‌ను 300 పడకలతో అందుబాటులోకి తెచ్చామని మెడికవర్ హాస్పిటల్స్ ఇండియా చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అనిల్ కృష్ణ తెలిపారు. ఇది తమకు 24వ హాస్పిటల్ అని వెల్లడించారు. ఇక్కడ ప్రపంచ స్థాయి నాలెడ్జ్ కలిగిన 40 పైగా డాక్టర్లు అందుబాటులో ఉంటారని తెలిపారు.

బలహీనుల అక్రమ రవాణా

- మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

చదువులేని దిగువ సామాజిక వర్గాల వారిని లక్ష్యంగా చేసుకుని కొన్ని ముఠాలు వెట్టి చాకిరి చేయిస్తున్నట్టు తెలంగాణ మీడియా అకాడమి చైర్మన్ కె శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమి ఆడిటోరియంలో "హ్యూమన్ ట్రాఫికింగ్, బాండెడ్ లేబర్" అంశంపై తెలంగాణ మీడియా అకాడమీ, ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ సంయుక్తంగా వర్క్‌షాప్ నిర్వహించాయి. ఈ సందర్భంగా చైర్మెన్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో మానవ అక్రమ రవాణా సమాజంలో అత్యంత బలహీనవర్గాల వారిపై ప్రభావం చూపుతున్నదన్నారు. బాధితుల్లో సగానికి పైగా బలవంతపు లేదా బాండెడ్ లేబర్‌లో ఉన్నారనీ, వారంతా ఇటుక బట్టీలు, గృహ నిర్మాణం, ప్రాజెక్టు పనులు, బహుళ అంతస్తులలో పనులు, వస్త్ర కర్మాగారాలు, వ్యవసాయం లేదా రాతి గనులలో రోజుకు 12 గంటలు లేదా అంతకంటే ఎక్కువ పని చేస్తున్నారని చెప్పారు. అలాంటి వారిని గుర్తించి మీడియా ప్రతినిధులు రిపోర్టింగ్ ద్వారా ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. వారంతా దళారుల చేత మోసగించినవారై ఉన్నారని గుర్తు చేశారు. దళారులు వారికి కూలి పని కల్పిస్తామని ముందుగానే ఎక్కువ డబ్బులు ఆశ చూపి వడ్డీ ద్వారా అప్పులు సమకూర్చడం ద్వారా వారి జీవితాలను, వారి కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్నారని ఆయన అన్నారు. శ్రమను దోచుకుంటున్నవారిని శిక్షించాల్సిన అవసరం ఉందన్నారు. మరణించిన కార్మికుల అప్పులు వారి పిల్లలు, తోబుట్టువులు, తల్లిదండ్రులకు బదిలీ చేసి ఇంకా వేదిస్తున్న సంఘటనలు అనేకం ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమి కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు, ఐజెఎం మీడియా కమ్యూనికేషన్స్ అధిపతి ప్రియా అబ్రహాం తదితరులు పల్గొన్నారు.

మహిళ దారుణ హత్య

- లైంగిక దాడి.. ఆపై హత్య చేసిన దుండగులు !

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

గుర్తు తెలియని మహిళపై దుండగులు లైంగికదాడి చేసి.. ఆ తర్వాత చంపేశారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా రాజేందర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఆలస్యంగా వెలుగు చూసింది. రాజేంద్రనగర్ సిఐ కాస్ట్రో తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో కిస్మత్‌పూర్ బ్రిడ్జి కింద నగ్నంగా పడి ఉన్న మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. హత్య జరిగి మూడ్రోజులు కావొచ్చని, ఎక్కడో ఆమెపై లైంగికదాడికి పాల్పడి, అనంతరం హత్య చేసి ఇక్కడ పడేసి వెళ్లిపోయారని పోలీసులు భావిస్తున్నారు. మహిళ వయసు 25 నుంచి 30 వరకు ఉంటుంది. సమీపంలోని సిసి కెమెరాలను పరిశీలించారు. ఘటనా స్థలంలో క్లూస్ టీం, డాగ్స్ స్కార్డ్‌తో ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని స్థానికులు ఎవరూ గుర్తించకపోవడంతో సమీప పోలీస్ స్టేషన్లలో నమోదైన మిస్సింగ్ కేసులను పరిశీలిస్తున్నారు. త్వరలోనే కేసును ఛేదిస్తామని సిఐ తెలిపారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

పోక్సో కేసులో నిందితునికి 23 ఏళ్ల జైలు శిక్ష

- రూ.40 వేల జరిమానా

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

చిన్నారిపై లైంగికదాడి ఘటన పోక్సో కేసులో నల్లగొండ అదనపు జడ్జి -2 మంగళవారం నిందితునికి 23 ఏళ్ల జైలు శిక్ష, రూ.40 వేల జరిమానా విధించినట్టు ఎస్‌పి శరత్‌చంద్రపవార్ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. 2023 మార్చిలో నల్లగొండ మండలం అన్నెపర్తి గ్రామానికి చెందిన మర్రి ఊషయ్య ఇంట్లో ఒంటరిగా ఉన్న పదేండ్ల బాలికపై లైంగికదాడికి ఒడిగట్టాడు. ఆ తర్వాత జరిగిన దారుణాన్ని బాధితురాలు తల్లికి చెప్పింది. ఈ ఘటనపై 29-03-2023న నల్లగొండ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. నిందితునిపై పోక్సో కేసు నమోదైంది. పోలీసులు పూర్తి విచారణ జరిపి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. అదనపు జడ్జి -2, ఎస్‌సి, ఎస్‌టి కోర్టు, పోక్సో కేసుల కోర్టు నిందితున్ని దోషిగా నిర్ధారించింది. నేరస్థునికి 23 ఏండ్ల కఠిన కారాగార శిక్ష, రూ.40,000 జరిమానా విధించారు. ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ డిఎస్‌పి నర్సింహారెడ్డి, ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి, నల్లగొండ డిఎస్‌పి కె శివరాంరెడ్డి, నల్లగొండ రూరల్ సిఐ రాఘవరావు, ఎస్‌ఐ సైదాబాబు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్‌కుమార్, సిడిఒ దుర్గరాజు, లీగల్ ఆఫీసర్ భరోసా సెంటర్ కె కల్పన, లైజన్ అధికారులు పి నరేందర్, ఎన్ మల్లికార్జున్‌ను ఎస్‌పి అభినందించారు.

పేదరికమే ఆసరాగా యాజమాన్యాల దోపిడీ

- బందీఖానాలో 'కార్మికులు'
- పని ప్రదేశాల్లో అవస్థలు
- ప్రమాదపుటంచుల్లో జీవనం
- 12 గంటల పనిదినం అమలు
- పారిశ్రామికవాడల్లో కార్మికుల ఇబ్బందులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'ఒడిశాకు చెందిన షణుముఖ్‌రావు రెండు నెలల క్రితం తెలంగాణకు వలసొచ్చాడు. జిల్లాలోని మహేశ్వరం ప్రాంతంలో రెసల్యూషన్ కంపెనీ థర్మకోల్, ఎలక్ట్రానిక్ టీవీల స్పేర్ పార్ట్స్ తయారీ కంపెనీలో లోడింగ్, అన్ లోడింగ్ హమాలీ పనిలో కుదిరాడు. రోజు కేవలం రూ.300 వేతనం ఇస్తామని కంపెనీ యజమాన్యం ఒప్పందం చేసుకుంది. రెండు నెలలుగా రాత్రి, పగలు లేడా లేకుండా రోజుకు 12 నుంచి 14 గంటల వరకు పనిచేయించుకుంటున్న యజమాన్యం ఇప్పటి వరకు వేతనం ఇవ్వలేదు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య కుట్టుమిషన్ కుట్టి కుటుంబాన్ని పోషిస్తోంది.'

'ఉత్తరప్రదేశ్‌కి చెందిన సుదియ ఆరేళ్ల క్రితం భర్తతో పాటు ఉపాధి కోసం తెలంగాణకు వచ్చింది. వాటర్ ట్యాంక్ తయారీ కంపెనీలో భార్యభర్తలు పనిచేస్తున్నారు. రోజుకు 12 గంటలు పనిచేస్తే ఇద్దరికి వచ్చే వేతనం రూ.600. ఈ లెక్కన వారికి నెలకు రూ.18 వేల వేతనం రావాలి. కానీ యజమాన్యం మాత్రం ఆదివారం, సెలవు దినాల్లో వేతనం కోత విధిస్తోంది. దాంతో వారికి నెలకు రూ.15 వేలకు మించి రావడం లేదు. ఈ డబ్బులు కుటుంబ పోషణకే సరిపోవడం లేదు.' పారిశ్రామికవాడల్లో ఏ కార్మికుడిని కదిలించినా ఇలాంటి ఇబ్బందులే ఉన్నాయి. వీరికి కార్మిక చట్టాలు ఏ మాత్రం వర్తించడం లేదు. మానవత్వాన్ని మరిచిన పెట్టుబడిదారులు కార్మికుల పేదరికాన్ని ఆసరాగా చేసుకుని వారి శ్రమను దోచుకుంటున్నారు. పారిశ్రామిక వాడల్లో శ్రమదోపిడీకి గురవుతున్న వలస కార్మికుల గాథలపై ప్రత్యేక కథనం.

పారిశ్రామికవాడల్లో కార్మికుల బతుకులు బందీ అవుతున్నాయి. రోజులో 14గంటలకు చెమటోడ్చినా పూట గడవని పరిస్థితి నెలకొంది. పనికి తగ్గ వేతనం, రానున్న కనీస కూలీ ఇవ్వకుండా యజమాన్యాలు కార్మికుల శ్రమను దోచుకుంటున్నాయి. కార్మికుల పేదరికాన్ని ఆసరాగా చేసుకుని.. వారితో వెట్టి చాకిరీ చేయిస్తున్నాయి. సొంత రాష్ట్రాల్లో ఉపాధి లేక తప్పనిసరి పరిస్థితుల్లో పొట్టకూటిని కార్మికులు పరిశ్రమల్లో మగ్గుతున్నారు. యజమాన్యాన్ని ఎదిరించి ప్రశ్నిస్తే.. ఉన్న ఉద్యోగం కూడా పోతుందేమోనని భయం గుప్పిట్లో బతుకుతున్నారు. నెలకు వచ్చే అత్తెసరు జీతంతో ఒకపూట తింటూ.. మరో పూట పస్తులుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరికి కార్మికుల చట్టాలు వర్తించడం లేదు. అధికారుల తనిఖీలూ లేవు.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా వివిధ పారిశ్రామికవాడల్లో పనిచేస్తున్న కార్మికులు కార్మిక శాఖ లెక్కల ప్రకారం లక్ష మంది ఉన్నారు. ప్రభుత్వం గుర్తించని వారు మరో 50వేల మంది ఉన్నారు. పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల్లో 80 శాతం మంది ఇంతరాష్ట్ర కార్మికులే. ఒడిశా, బీహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బెంగాల్, ఆంధ్రప్రదేశ్ నుంచి బతుకుదెరువు కోసం వచ్చినవారే. పేదరికాన్ని ఆసరాగా చేస్తుకున్న యజమాన్యాలు వీరితో రోజుకు 12 గంటల పాటు కష్టం చేయించుకుంటున్నాయి. నెలలో 27 రోజులు పనిచేస్తేనే పూర్తి వేతనం ఇస్తున్నాయి. రోజు వారి వేతనం రూ.250 మాత్రమే చెల్లిస్తున్నాయి. కార్మికులకు తక్కువ వేతనాలు చెల్లించి అధికలాభాలు పొందుతున్నాయి. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి, కార్మికుల శ్రమకు తగ్గ వేతనం అందేలా చర్యలు తీసుకోవాలని, వారికి అన్నిరకాల రక్షణ కల్పించాలని కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు కోరుతున్నారు.

శ్రమకు తగ్గ వేతనాలివ్వాలి : చంద్రమోహన్, సిఐటియు రంగారెడ్డి జిల్లా కార్యదర్శి

కార్మికుల అవసరాలను ఆసరాగా చేసుకుని కంపెనీల యజమాన్యాలు కార్మికులను శ్రమను దోచుకుంటున్నాయి. వెట్టి చాకిరీ చేయించుకుని చాలీచాలని వేతనాలు ఇస్తున్నాయి. మిషన్ల వద్ద ఆపరేటర్లుగా పనిచేస్తున్న కార్మికులు తమ ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని పనిచేస్తున్నారు. ఏ సమయంలో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి. అలాంటి ప్రదేశాల్లో రక్షణ కల్పించాల్సిన బాధ్యత కంపెనీల యజమాన్యాలపై ఉంది. కార్మికుల శ్రమకు తగ్గ వేతనాన్ని యజమాన్యాలు చెల్లించాలి. సకాలంలో వేతనాలు ఇవ్వాలి. కార్మికులపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నా కార్మిక శాఖ, ప్రభుత్వం తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నాయి. కార్మికుల హక్కుల కోసం సిఐటియు గతంలో అనేక పోరాటాలు చేసింది. భవిష్యత్‌లోనూ పారిశ్రామికవాడల్లో కార్మికులను ఐక్యం చేసి ఉద్యమాలకు పిలుపునిస్తాం.